రహదారి ఛిద్రం.. ప్రయాణం నరకం

శిథిలావస్థకు చేరిన పెందుర్తి-అక్కిరెడ్డిపాలెం-జుత్తాడ రహదారి

పెందుర్తి-అక్కిరెడ్డిపాలెం-జుత్తాడ-అడవివరం రహదారి. వేలాది మంది రాకపోకలు సాగించే రోడ్డు. దాదాపు 15 ఊళ్లను పెందుర్తి నుంచి అడవివరం/సింహాచలానికి దగ్గర చేసే ప్రధాన మార్గం ఇదే. కానీ ఆ రోడ్డు నిర్మాణానికి గ్రహణం వీడలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించింది. సాంకేతిక కారణాలు, ఆ తర్వాత ఎన్నికల రాకతో టెండర్ దశలోనే ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం స్పందించి, రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- దారి పొడవునా గోతులు, రాళ్లు తేలి, బురదమయం
- రోడ్డు నిర్మాణం కోసం రూ.3 కోట్లు విడుదల చేసిన గత ప్రభుత్వం
- సాంకేతిక కారణాలు, ఎన్నికల రాకతో నిలిచిపోయిన టెండర్
- ప్రభుత్వం స్పందించి రోడ్డు పనులు ప్రారంభించాలని ప్రజల వినతి



అక్కిరెడ్డిపాలెం కూడలి సమీపంలో పూర్తిగా శిథిలమైన రోడ్డు

పెందుర్తి: పెందుర్తి-జుత్తాడ-అడవివరం రహదారి చాలా ఊళ్లకు ప్రధాన మార్గం. ఈ రోడ్డు మీదుగా జంగాలపాలెం, సరిపల్లి, ముదపాక, గుర్రంపాలెం, బొడ్డునాయుడుపాలెం, అక్కిరెడ్డిపాలెం, పీఎస్ఎల్, రాయవరపువానిపాలెం తదితర గ్రామాల నుంచి సింహాచలం రోడ్డుకు నిముషాల్లో చేరుకోవచ్చు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు పరిస్థితి మరింతగా దిగజారింది. వర్షం కురిస్తే రోడ్డేదో.. గొయ్యేదో కూడా గుర్తించడం కష్టం. ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డు నిర్మాణానికి ముందుకు రావాలని స్థానిక ప్రజలు వేడుకుంటున్నారు.

గత ప్రభుత్వంలో రూ.30 కోట్లు కేటాయింపు

రోడ్డు దుస్థితిని తెలుసుకున్న గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్డు పునరుద్ధరణకు రూ.3 కోట్లు కేటాయించింది. వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో 80 అడుగుల రోడ్డు ప్రతిపాదన ఉన్నప్పటికీ ప్రస్తుతం 30 అడుగుల రోడ్డైనా పూర్తి చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అవసరమైన నిధుల్ని విడుదల చేసింది. కానీ కొన్ని సాంకేతిక కారణాలు, తరువాత ఎన్నికలు రావడంతో టెండర్ దశలోనే రోడ్డు పనులు నిలిచిపోయాయి. తాజాగా కురిసిన భారీ వర్షాలతో ఈ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది.



వాలిమెరక జుత్తాడ సమీపంలో అధ్వానంగా ఉన్న రహదారి

ఇదే దగ్గరి దారి

పెందుర్తి-ఆనందపురం ప్రధాన రహదారి, అక్కిరెడ్డిపాలెం కూడలి నుంచి జుత్తాడ, దువ్వపాలెం మీదుగా ఈ రోడ్డు అడవివరానికి కలుస్తుంది. పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు మండల కేంద్రం పెందుర్తికి ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు ఆయా ప్రాంతాల ప్రజలు ఆరిలోవ మెడికల్ హబ్‌కు చేరుకోవాలంటే ఇదే దగ్గరి దారి. ఆయా ప్రాంతాల వాసులు నగర శివారు మధురవాడ, హనుమంతవాక ప్రాంతాలతో పాటు ఎంవీపీ కాలనీ, ఇసుకతోట తదితర ప్రాంతాలకు చేరుకోవాలంటే ఈ మార్గంలోనే ప్రయాణం సులభంగా ఉంటుంది.

దారి పొడవునా గోతులే..

దాదాపు పుష్కరకాలంగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. వర్షాలతో పాటు క్వారీ లారీలు తరచూ తిరగడంతో రోడ్డు పూర్తిగా పాడైంది. తాజాగా కురిసిన వర్షాలతో ప్రస్తుతం ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాలు కూడా రాకపోకలు సాగించే పరిస్థితి లేదు. అడుగుకో గొయ్యి రహదారిపై దర్శనమిస్తోంది. రోడ్డు శిథిలమై రాళ్లు తేలాయి. రోడ్డు అంచులు కోతకు గురయ్యాయి. గోతుల్లో నీరు చేరి బురదమయం అయింది. ఈ మార్గంలో ప్రయాణించేందుకు వాహనదారులు నరకం చూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఈ రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

అత్యవసర సమయంలో ఉపయోగం



నిత్యం మా ఊరి మీదుగా వేలాది మంది సింహాచలం, ఆరిలోవ ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. వైద్యం కోసం ఆరిలోవ ఆస్పత్రులకు అత్యవసర సమయంలో వెళ్లే వారికి ఈ రోడ్డు ఎంతో ఉపయోగం. ఏదైనా భారీ వాహనం వస్తే ఎదురుగా బైక్ కూడా తప్పుకోలేని పరిస్థితి. ఈ రోడ్డు బాగైతే దూరం, సమయం ఆదా అవుతుంది. అధికారులు చొరవ తీసుకుని, రోడ్డును పునరుద్ధరించాలి.

– ఉగ్గిన నాగార్జున, జుత్తాడ

వాహనాలు పాడవుతున్నాయి



ఆటో నా జీవనాధారం. నిత్యం ఇదే రోడ్డు మీదుగా ఆటో నడుపుతుంటాను. ఒక్కోసారి రోజుకు నాలుగైదు సార్లు తిరగాల్సి ఉంటుంది. కానీ ఈ రోడ్డులో ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంది. ఆటో తరచూ మరమ్మతులకు గురవుతోంది. రోడ్డు కోతకు గురవడంతో ఎదురుగా పెద్ద వాహనాలు వస్తే తప్పించేందుకు చాలా ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

–గంద్రెడ్డి రమణ, ఆటో డ్రైవర్

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ కొలిక్కి వచ్చేసరికి సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. తరువాత మళ్లీ టెండర్ వేసే సమయానికి ఎన్నికలు వచ్చాయి. దీంతో రోడ్డు నిర్మాణం జరగలేదు. ఇటీవలే ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి రోడ్డు సమస్యను తీసుకెళ్లాం. ఆయన అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

– బొడ్డు సూర్యప్రకాష్, సీనియర్ నాయకుడు, జుత్తాడ



వర్షాలకు చెరువును తలపిస్తున్న దువ్వపాలెం సమీపంలోని రోడ్డు(ఫైల్)

క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో విశ్వనాథన్



విశ్వనాథన్‌కి స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఏఈవో రమణమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ మంగళవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనంతోపాటు, స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాలను ఏఈవో రమణమూర్తి అందజేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలి



మాట్లాడుతున్న డీటీ అర్జునరావు

పెందుర్తి: ఓటు హక్కు వయసు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ వి.అర్జునరావు పిలుపునిచ్చారు. స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల, పినగాడిలోని వెల్ఫేర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఓటు హక్కుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన యువత స్వచ్ఛందంగా ఓటు హక్కును నమోదు చేయించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో విలువైనదని, యువత పాత్ర మరింత కీలకమని పేర్కొన్నారు. అవగాహన సదస్సుల్లో ఆయా కళాశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

సబ్బవరం: బాలిక అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు సబ్బవరం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని జీవీఎంసీ పరిధి గంగవరానికి చెందిన మాటూరి రూప నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. ఈ నెల 19న ఉదయం 8 గంటల సమయంలో స్కూల్‌కు అని చెప్పి, ఇంటి నుంచి బయల్దేరింది. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించడంతో పాటు, బంధువుల ఇళ్లలోవాకబు చేశారు. అయినప్పటికీ బాలిక ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి రామారావు ఫిర్యాదు చేసినట్లు సీఐ పిన్నంటి రమణ తెలిపారు. ఒక వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో అందుబాటులో సీటీ స్కానింగ్

ఇన్ పెషెంట్స్, అత్యవసర రోగులకు మాత్రమే

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో అరబిందో కంపెనీ సీఎస్ఆర్ (రూ.కోటి 85లక్షల) నిధులతో ఏర్పాటు చేసిన సీటీ స్కానింగ్ మిషన్ సేవలు ఇన్‌పెషెంట్ రోగులకు, అత్యవసర విభాగంలో రోగులకు మాత్రమే అందుబాటులోనికి తీసుకుని రావడం జరిగిందని వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సీటీ స్కానింగ్ సేవలు లభిస్తాయన్నారు. ఈ సేవల కోసం ఇద్దరు టెక్నిషియన్లు, ఒక డేటా ఎంట్రీ అపరేటర్‌ను ఏపీఎంఐడీసీ అధికారులు నియమించారని తెలిపారు. రోజుకు 10 నుంచి 20 మంది రోగులకు సీటీ స్కానింగ్ చేస్తున్నామని చెప్పారు. కొత్తగా ఆస్పత్రిలో రేడియాలజిస్టు పోస్టు కోసం ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు.

స్వధార్ హోం నుంచి మహిళ అదృశ్యం

పెందుర్తి: చినముషిడివాడ స్వధార్ హోంలో ఆశ్రయం పొందుతున్న ఓ యువతి అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీస్ స్టేషన్లో స్వధార్ హోం ప్రతినిధి లింగమ్మ మంగళవారం ఫిర్యాదు చేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ యువతి గత కొద్దిరోజులుగా స్వధార్ హోంలో ఆశ్రయం పొందుతోంది. సోమవారం రాత్రి నుంచి ఆమె కనిపించడం లేదు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

అభిజిత్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి



రాస్తారోకోలో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

పరవాడ: అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో అక్రమ లే ఆఫ్‌ను ప్రకటించిన అభిజిత్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. అభిజిత్ అక్రమ లే ఆఫ్‌ను నిరసిస్తూ పరవాడ సినిమాహాలు కూడలిలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభిజిత్ యాజమాన్యం తీరును నిరసించారు. కార్మిక చట్టాల పేరిట వెయ్యి మందిని రోడ్డుపాలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. 1926 ట్రేడ్ యూనియన్ చట్టం ప్రకారం వెంటనే యూనియన్ రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యల పరిష్కారానికి ఎస్ఈజెడ్ అభివృద్ధి కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అభిజిత్ విధించిన అక్రమ లే ఆఫ్ పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం చెల్లదన్నారు. వెంటనే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. అక్రమ లే ఆఫ్‌తో కార్మికుల్లో అభద్రతా భావాన్ని పెంచిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అప్పారావు, కె.నాయుడు, జి.శ్రీను, ఎం.కృష్ణ పాల్గొన్నారు.

సాహితీ సేవలో సాయిరాం ప్రతిభ



సాయిరాంను సత్కరిస్తున్న కళావేదిక ప్రతినిధులు

పరవాడ: కవితాగానం/కళా ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన స్థానిక పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ఎస్ సాయిరాం పేరును అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సు, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్సు, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ(తానా) బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదు చేసినట్లు కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ ప్రకటించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం కన్వెన్షన్ హాలులో శ్రీశ్రీ కళావేదిక, అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన ప్రపంచ తెలుగు కళాజాతర కార్యక్రమంలో ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా సాయిరాంను సత్కరించి కళావేదిక కార్యదర్శి డా.టి.పార్థసారథి, అంతర్జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి చేతుల మీదుగా జ్ఞాపిక, సర్టిఫికెట్ అందించారు. తెలుగు సాహితీ కళారంగ చరిత్రలో 24 గంటల నిర్విరామ సాహితీ ప్రదర్శనలో ప్రతిభకు గాను తన పేరును ఎంపిక చేసినట్లు సాయిరాం తెలిపారు. సాయిరాంను పీహెచ్‌సీ వైద్యాధికారులు డా.హారిక, డా.జయశ్రీకరిష్మా, సిబ్బంది వి.వెంకటరావు, పీహెచ్ఎన్ జానకీరామన్, ఆనందకుమార్, పీవీ రత్నం, ఎం.సతీష్ అభినందించారు.

రైతుల ప్రతి అర్జీకి సకాలంలో పరిష్కారం



రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో రైతుల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ చిన్నకృష్ణ అన్నారు. మండలంలోని అమృతపురం శివారు చింతగట్ల అగ్రహారంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామంలో 182.74 ఎకరాల విస్తీర్ణంలో 28.30 ఎకరాల ప్రభుత్వ భూములుండగా, 154.44 ఎకరాల జిరాయితీ భూములున్నట్లు వెల్లడించారు. ఈ రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి పలు రకాల సమస్యలపై 69 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు గ్రామ పెద్దలు బైలపూడి రామారావు, మండల సర్వేయర్ లాలం అప్పారావు, ఆర్ఐ వీరయ్య, సర్వేయర్లు ఎం.ఆదిత్య, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్‌పై మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన



మహిళా సమాఖ్య సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంపీడీవో పద్మజ ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సభ్యులకు ఉల్లాస్(సమాజంలో అందరికీ జీవితకాల అభ్యాసంపై అవగాహన-యూఎల్ఎల్ఏఎస్) పథకం గురించి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో నిరక్షరాస్యులకు, చదువు మధ్యలో ఆపేసిన వయోజనులకు ప్రాథమిక విద్య, డిజిటల్ విద్య, ఆర్థిక విద్య అందించేందుకు వీలుగా స్థానిక మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సెర్ప్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు. కుటుంబ సంక్షేమంతోపాటు, వయోజన విద్యను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణరావు, ఏరియా కో ఆర్డినేటర్ రాజేశ్వరి, ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి, ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు, మండలంలోని మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



స్వామికి యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం



మహిళను లయోలా వృద్ధాశ్రమానికి అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి: మండలంలోని సరిపల్లి పరిసర ప్రాంతాల్లో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ మహిళకు స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో పెందుర్తి పోలీసులు ఆశ్రయం కల్పించారు. దాదాపు 35 ఏళ్ల వయసున్న మహిళ గత కొన్ని రోజులుగా సరిపల్లి గ్రామంలోని వీధుల్లో తిరుగాడుతోంది. ఆమెను పలుమార్లు అక్కడ గమనించిన స్థానిక మహిళ ఉష పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు అక్కడకు చేరుకున్న పోలీసులు సదరు మహిళ గురించి ఆరా తీశారు. అనంతరం లయోలా వృద్ధాశ్రమానికి తరలించి, ఆశ్రయం కల్పించేలా నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం వారి సంరక్షణకు మహిళను అప్పగించారు.

గోతులు పూడ్చారు



సాక్షి ఎఫెక్ట్..

ఎన్టీపీసీ వద్ద గోతులను పూడ్చిన దృశ్యం

పరవాడ: వాడచీపురుపల్లి-పరవాడ రహదారిలో ఎన్టీపీసీ వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏర్పడ్డ గోతులను ఎన్టీపీసీ అధికారులు కాంక్రీట్‌తో పూడ్చారు. ఇక్కడ ఏర్పడిన గోతులతో ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు నిత్యం ప్రమాదాల బారిన పడేవారు. దీనిపై ఈ నెల 18న 'ఆగని చినుకులు అధ్వానంగా రోడ్లు' శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఎన్టీపీసీ అధికారులు స్పందించారు. ఎట్టకేలకు ఎన్టీపీసీ అధికారులు ముందుకు వచ్చి గోతుల్ని పూడ్చడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు.

తుపాను హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తం

అధికారులతో సమీక్షా సమావేశంలో ఎంపీడీవో పద్మజ



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండల ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీవో బి.పద్మజ అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలు శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆమె మంగళవారం సమీక్ష నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులంతా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్ సమస్య తలెత్తే అవకాశం ఉండటంతో ప్రజలకు అవసరమైన తాగునీటిని అందించేందుకు వాటర్ ట్యాంకులను నింపి ఉంచుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్య సామగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ బి.చైతన్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్‌తో పాటు పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్ఎన్ఎల్‌యూలో ఫ్యాషన్, మీడియా చట్టాలపై సదస్సు



నమ్రత పహ్వాను సత్కరిస్తున్న వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు

సబ్బవరం: ఫ్యాషన్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ చట్టాలపై చైతన్యం, ఆయా రంగాల్లో న్యాయపరమైన అభ్యాసం ద్వారా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ప్రముఖ న్యాయవాది నమ్రత పహ్వా అన్నారు. ఫ్యాషన్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ లా అధ్యయనానికి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) ఒక సెంటర్(సి-ఎఫ్ఏఎంఈ)ను ప్రారంభించింది. ఈ మేరకు ఇంట్రడక్షన్ టు ఫ్యాషన్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ లా అనే అంశంపై మంగళవారం ఒక రోజు సెమినార్ నిర్వహించారు. సెమినార్‌లో ముఖ్య అతిథిగా ఫ్యాషన్ లా, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాలలో ప్రముఖ న్యాయవాది అయిన నమ్రత పహ్వా మాట్లాడారు. ఏదైనా ప్రసిద్ధ సంస్థల సృజనాత్మకతను ఇతరులు దొంగిలించినట్లయితే ఒరిజినల్ సృష్టికర్తల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వాటిని పరిరక్షించేందుకు నిర్దిష్టమైన చట్టాలు లేనప్పుడు ఇప్పటికే ఉన్న ఐపీఆర్ చట్టాలను ఉపయోగించుకుని న్యాయస్థానాలు ఎలా వివాదాలను పరిష్కరిస్తాయో వివరించారు. దేశంలో మొదటి సారిగా ఈ రంగ సమస్యలపై ఒక అధ్యయన కేంద్రం ఏర్పాటు చేసినందుకు యూనివర్సిటీ యాజమాన్యాన్ని అభినందించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ వ్యక్తిత్వ హక్కులు, ఫ్యాషన్ ప్రాముఖ్యతను వివరించారు. వ్యక్తిగత ఎంపిక అనేది ప్రతి వ్యక్తి హక్కని, ఆ హక్కును ప్రస్తుత చట్టాల ద్వారా తప్పనిసరిగా రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక నిర్మించాలని వినతి



తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీల ప్రతినిధులు

పెందుర్తి: చినముషిడివాడ వుడా కాలనీ సమీపంలోని 10 కాలనీలకు శ్మశానవాటిక లేకపోవడంతో దహన సంస్కారాల సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం పెందుర్తి తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ ప్రాంతంలో జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు స్పందించి శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు విన్నకోట రాము, పాత్రుడు, ప్రసాదరావు, గోవిందరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.